GOLCONDA TIMES NEWS

# గోల్కొండ టైమ్స్

Regd. by Govt of India
No.UDYAM-TS-20-0003208

www.golcondatimes.com | శుక్రవారం 05, డిసెంబర్ 2025 | పేజీలు : 04


## ఆదిలాబాద్‌కు ఏయిర్ బస్‌ను తీసుకొస్తా

### అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెడతా

- ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తా
- జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తా
- ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తిగా ముందుకెళుతున్నా
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన




**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్‌ను అభివృద్ధి చెందిన జిల్లాగా అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి ఈ జిల్లా పంట పొలాలకు నీళ్లిస్తామన్నారు. త్వరలోనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ఆదిలాబాద్ జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తామని ప్రకటించారు. 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమాల్లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు, చనాక – కొరాట ప్రాజెక్టు నిర్మాణంతో పాటు, విమానాశ్రయం, విశ్వవిద్యాలయం ఏర్పాటు, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం వంటి పలు కీలక అంశాలను వివరించారు. 'అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని.. జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేకమైన ప్రణాళికలు తయారు చేసి సమీక్షా సమావేశం నిర్వహించి ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.

ఎక్కడైతే ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యునికేషన్ సరిగా..

మిగతా 2వ పేజీలో..



## స్నేహితుడికి స్వాగతం




నా స్నేహితుడు అధ్యక్షుడు పుతిన్‌ను భారతదేశానికి స్వాగతించడం ఆనందంగా ఉందని అన్నారు. భారతదేశం-రష్యా స్నేహం కాల పరీక్షకు గురైనది, ఇది మన ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చిందని ఆయన అన్నారు. కాగా అధ్యక్షుడు పుతిన్‌కు రష్యన్ భాషలో గీత ప్రతిని బహూకరించారు. గీత బోధనలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని ఆయన వివరించారు.

- గోల్కొండ టైమ్స్, నేషనల్ బ్యూరో

## రాజస్థాన్‌లో సింగరేణి ప్రాజెక్టు

2,300 మెగావాట్ల సోలార్, థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణానికి రాజస్థాన్ కేబినెట్ ఆమోదం



తెలంగాణతో పొరుగు రాష్ట్రం ఒప్పందం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ అందించిన రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి

02



## హిడ్మా ఎన్‌కౌంటర్ భూటకం

- శంకర్‌ను కూడా చిత్రహింసలు పెట్టారు
- దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్

04




04

## హిల్ట్ పాలసీపై పోరాటం కొనసాగిస్తాం

సర్కార్‌కు కేటీఆర్ హెచ్చరికలు

## 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్



04


- దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ'
- స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ప్రత్యేకంగా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

## గ్లోబల్ సమ్మిట్‌లో కీరవాణి కచేరి

అలరించనున్న భిన్న సాంస్కృతిక, కళా రూపాలు

90 నిమిషాల పాటు ప్రత్యేక సంగీత కచేరి

ఇంద్రజాల ప్రదర్శకుడు సామల వేణు ప్రదర్శన



04



## రాజస్థాన్‌లో సింగరేణి ప్రాజెక్టు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ అందించిన రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి**

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

సింగరేణి సంస్థతో కలిసి రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ 2,300 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల (1500 మెగావాట్ల సోలార్, 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ల) నిర్మాణానికి రాజస్థాన్ ప్రభుత్వ క్యాబినెట్ ఇటీవల ఆమోదం తెలిపిందని రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ పేర్కొన్నారు. హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో ఆయన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని గురువారం కలిసి ఈ మేరకు ఒక లేఖను అందించి ఉమ్మడి విద్యుత్ ప్రాజెక్టులపై చర్చించారు.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తో కలిసి తమ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ వారు 1,500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదన కోసం ఒప్పందం కుదుర్చుకున్నారని, దీనికి తమ రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ అనుమతి మంజూరు చేసిందన్నారు. రెండు రాష్ట్రాల విద్యుత్ అవసరాలకు ఈ కొత్త ప్రాజెక్టులు ఎంతో దోహదపడనున్నాయని కనుక వీటిని త్వరగా పూర్తి చేయాలన్న ఉద్దేశంతో తమ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదాన్ని వెంటనే మంజూరు చేసిందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా తొలిసారిగా ఇతర రాష్ట్రమైన రాజస్థాన్ ఒప్పందం కుదుర్చుకుందని ఈ తరహాలో ఇతర రాష్ట్రాలతో కూడా గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజస్థాన్ కాలూరామ్, ప్రమోద్ శర్మ, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడీ చిరంజీవి, జీఎం (కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 10న ఢిల్లీలో ఉపాధ్యాయ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

**వుదయం, హైదరాబాద్**

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్షను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాల రక్షణ మరియు విద్యా రంగంలో సంక్షోభం నివారణకు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తగిన ఐక్య కార్యాచరణను రూపొందించుకోవటానికి ఈ నెల 10న న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ సమీపంలోని సూర్జిత్ భవన్ నందు జాతీయ స్థాయి ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి ఎన్ భార్తి, చావ రవి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి కార్యాచరణను రూపొందించే దిశగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, అన్ని ఉపాధ్యాయ సంఘాల జాతీయ స్థాయి ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను తెలియజేసి, కార్యాచరణలో భాగస్వాములు కావాలని ఎస్టీఎఫ్ఐ నాయకులు కోరారు.


తెలంగాణ చికెన్ షాప్స్ అసోసియేషన్
RNR Fresh Chicken
No.1 & the Tastiest Chicken in the world

| | |
|---|---|
| ఫార్మ్ రేటు | - 127 |
| రిటైయిల్ లైవ్ | - 168 |
| విత్ స్కిన్ | - 246 |
| స్కిన్‌లెస్ | - 266 |
| బొన్‌లెస్ | - 510 |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీ చేయడమైనది
condition apply


# ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తా

**మొదటి పేజీ తరువాత..**



ఉంటుందో ఆ ప్రాంతంలో అభివృద్ధి ఉంటుంది. జిల్లాకు ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఏటీసీ మంజూరు చేశామని గుర్తు చేశారు. మెడికల్ కాలేజీ ఇచ్చామని చెప్పారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన తర్వాత జిల్లాకు విశ్వవిద్యాలయం ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తామని తెలిపారు. ఎక్కడ పెట్టాలన్నది స్థలం ఎంపికను ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ వర్సిటీని ఇంద్రవెల్లిలో పెడితే బాగుంటుందని నా అభిప్రాయం. దానికి కొమురం భీం విశ్వవిద్యాలయంగా నామకరణం చేస్తే మరింత బాగుంటుందని.. ఇది కేవలం నా అభిప్రాయం మాత్రమే. ఎక్కడ పెట్టాలన్నది ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు చర్చించి నిర్ణయానికి రావాలన్నారు.

ఆదిలాబాద్ జిల్లాకు నీరివ్వడానికి 150 మీటర్ల ఎత్తులో ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినప్పటికీ గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పక్కనపెట్టింది. తొందరలోనే పనులు ప్రారంభించి ప్రాజెక్టును చేపట్టి రైతులను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. అలాగే చనాక – కొరాట ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణంపై ప్రత్యేక దృష్టిని సారిస్తా. ఏడాది తిరిగే లోపు విమానాశ్రయ నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో ఎర్రబస్సులు ఆపడమే కష్టమనుకున్న ప్రాంతంలో విమానాలు దిగేలా చేస్తాం. తెలంగాణ ఉద్యమం అంటేనే నీళ్లు, నిధులు, నియామకాలు. కానీ గడిచిన దశాబ్ద కాలంలో నియామకాలు చేపట్టకపోతే, ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం తిరిగే లోపు 61 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. 563 మందికి గ్రూప్ –1 ఉద్యోగాలిచ్చామని చెప్పారు.

ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ సంబరాలు ముగిసిన తర్వాత సమీక్ష నిర్వహించి మరో 40 వేల ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చేపడుతాం. మొత్తంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని నొక్కి చెప్పారు. యువత ఉన్నతంగా చదువుకుని ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉద్యోగాలు సాధించి తెలంగాణ కీర్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. యువతను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందనన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటగా ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్‌కు వచ్చాను. ఆదివాసీ హక్కుల కోసం పోరాటానికి మారుపేరైన కొమురం భీంని ఆదర్శంగా తీసుకుని, ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తిగా ముందుకు వెళుతున్నాం. ఇంద్రవెల్లి అమర వీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించడమే కాకుండా అమర వీరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఆదుకున్నాం.

జిల్లాలో సున్నపురాయి గనులున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవడానికి తొందరలోనే ప్రైవేటు పెట్టుబడిదారులను తీసుకొచ్చి ఇక్కడ సిమెంట్ పరిశ్రమను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా స్థానికులకు ఉపాధి కల్పించే చర్యలు చేపడుతామని తెలిపారు. ''ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, అవి ముగిసిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడమే మా లక్ష్యమని చెప్పాం. అభివృద్ధి, సంక్షేమం మాకు రెండు కళ్లలా భావిస్తాం. అందుకోసం నిరంతరం పనిచేస్తాం. తెలంగాణ ప్రజలకు సేవ చేయడం నాకు దేవుడిచ్చిన వరం. ప్రజలందించిన ఆశీస్సులు..'' అని ముఖ్యమంత్రి అన్నారు.





# సేంద్రియ వ్యవసాయ పద్ధతులు శ్రేయస్కరం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి
- కన్హా శాంతి వనంలో జాతీయ మహా కిసాన్ మేళా
- ముగింపు కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల రైతులు, శాస్త్రవేత్తల హాజరు

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**



ప్రస్తుత కాలానుగుణంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్ని ఆచరించాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్ శివారులోని కన్హా శాంతి వనంలో ఏషియన్ పిజిపిఆర్ సొసైటీ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం సహకారంతో జాతీయ మహా కిసాన్ మేళా ముగింపు సభకు చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ గడచిన పలు దశాబ్దాలుగా భారత దేశ వ్యవసాయ పరిణామ క్రమాన్ని వివరించారు. మనుషులు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలు ప్రధాన పాత్రను పోషిస్తాయని చిన్నారెడ్డి అన్నారు. అనంతరం ఏషియన్ పిజిపిఆర్ సొసైటీ ఎంపిక చేసిన ఉత్తమ రైతులకు అవార్డులు అందజేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 43 మంది రైతులకు తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అభ్యుదయ రైతులుగా ప్రశంస పత్రాలను డాక్టర్ జి చిన్నారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కిసాన్ మహా మేళాలో భాగంగా నేలలో ఉండే సూక్ష్మజీవులు, పోషకాల గురించి, ఆయిల్ పామ్ సాగు ఆవశ్యకత, ఉద్యాన, అధిక విలువ గల పంటల సాగు పద్ధతుల గురించి, డిజిటల్ వ్యవసాయం – వ్యవసాయంలో కృత్రిమ మేధ, డ్రోన్ల వినియోగం, ఐటి వినియోగం గురించి, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాల గురించి చర్చ కార్యక్రమాలలో శాస్త్రవేత్తలు, రైతులు మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో ఏషియన్ పిజిపిఆర్ సొసైటీ అధ్యక్షులు ఎమ్మెస్ రెడ్డి, రైతుగా పద్మశ్రీ అందుకున్న చింతల వెంకట రెడ్డి, మార్క్ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లాం, వ్యవసాయ విశ్వ విద్యాలయం రిటైర్డ్ విస్తరణ సంచాలకులు డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బీ. కృపాకర్ రెడ్డి, సూదిని హరికిషన్, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘ ప్రధాన కార్యదర్శి జి కృపాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శశిధర్ రెడ్డి, నరసింహులు హాజరయ్యారు.

## హైదరాబాద్ వారసత్వ వారసత్వ కట్టడాల అభివృద్ధి పనులను

# పరిశీలించిన బోర్డో మెట్రోపోల్ బృందం

### మేయర్, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశాలు





**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

ఫ్రాన్స్‌కు చెందిన బోర్డో మెట్రోపోల్ ప్రతి నిధి బృందం గురువారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసు లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాద పూర్వ కంగా కలిసింది. ఆర్కిటెక్చర్ అండ్ అర్బన్ హెరిటేజ్ హెడ్ అన్–లోర్ మోనియట్, ఫ్రాన్స్ డిప్యూటీ కాన్సల్ పాస్కల్ లోరో, బోర్డో మెట్రోపోల్ హైదరాబాద్ ఫోకల్ పాయింట్ హ్యూగో కువెట్ లతో కూడిన ఈ బృందం, హైదరాబాద్ నగర వారసత్వం, ప్రపంచ వారసత్వ నగరంగా ఎదిగే అవకాశాలపై మేయర్‌తో సుదీర్ఘంగా చర్చించింది. ఆ తర్వాత బృందం జీహె చ్ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి, క్యూక్యూ సుడా, నియో అధికారులతో సమావేశమై, హైదరాబాద్ పాతనగరంలో జరుగుతున్న వారసత్వ సంరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలు తెలుసుకుంది. నగరంలో వారసత్వ సంరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ వివరాలు బృందానికి కమిషనర్ తెలిపారు. పర్యటనలో



భాగంగా బృంద సభ్యులు నగరంలోని ఓల్డ్ సిటీలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్, పాత ఎంసిహెచ్ ఆఫీస్, సర్దార్ మహల్, ఖుర్షీద్ జా దేవడిలను పరిశీలించడంతో పాటు, చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి వారసత్వ కట్టడాలను సందర్శించారు. అంతకుముందు బృందం కుతుబ్ షాహీ టూంబ్స్‌ను సందర్శించి జరుగుతున్న సంరక్షణ, ల్యాండ్‌స్కేప్ అభివృద్ధి పనులను పరిశీలించింది. రాబోయే రోజుల్లో బోర్డో బృందం హైదరాబాద్‌లో ప్రతిపాదిత వారసత్వ ప్రాజెక్టులను సందర్శించనుంది. పారిస్ – హైదరాబాద్ నగరాల మధ్య సహకార కార్యక్రమాలకు పునాది వేసే సమగ్ర ప్రతిపాదనను బోర్డో మెట్రోపోల్ సిద్ధం చేయనుంది.

**మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేసియా అందజేత...**

వివిధ కారణాలతో మృతిచెందిన ముగ్గురు జీహెచ్ఎంసీ వర్కర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్ గ్రేసియా చెక్కను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లోని తన కార్యాలయంలో గురువారం అందజేశారు. జీహెచ్ఎంసీ వర్కర్ లుగా పనిచేస్తూ ఇటివలే షేక్ కరీం తన కుమారుడు షేక్ సహీల్ తో హుడా పార్క్ లో క్లీనింగ్ పనిచేస్తున్న సమయంలో మరణించారు. అవుట్ సోర్సింగ్ శానిటరీ వర్కర్ సామ పార్వతమ్మ రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. ఈ ముగ్గురికి రూ.6 లక్షల ఎక్స్ గ్రేసియా చెక్కను మేయర్ అడజేశారు. వారి యోగక్షేమాలను మేయర్ అడిగి తెలుసుకున్నారు.

## ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెడితే తప్పేంటి?

### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**



హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఉంటే తప్పేమిటని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, కొణిజేటి రోశయ్య, ఎస్పీ బాలు ఒక ప్రాంతానికి చెందిన వారని అన్నారు. ఈ దేశానికి వారు ఒక సంపద అని వ్యాఖ్యానించారు. కాబట్టి బాలు విగ్రహాన్ని రవీంద్ర భారతిలో పెట్టడంలో తప్పేమి లేదని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో మరోసారి బీఆర్ఎస్ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దేవుళ్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన సామెతను రాజకీయం చేయడం తగదని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ కోసమే పనిచేస్తున్నట్లున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్) పాలసీ ద్వారా హైదరాబాద్ నగరంలో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు. నగరం కూడా కాలుష్యరహితంగా మారుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి పాల్పడ్డారని, అందుకే తమ ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ కుటుంబానికి అవినీతి మాదిరిగా కనిపిస్తోందని విమర్శించారు.

# హిల్ట్‌పై అఖిలపక్షాన్ని వేయాలి

- విలువైన భూములను దారాదత్తం చేయొద్దు
- సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**




రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీపై వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు నగరంలోని 22 పారిశ్రామిక కేంద్రాల్లోని పరిశ్రమలన్నింటినీ నగరం బయటికి తరలించేందుకు జీవో నంబర్ 27ను విడుదల చేసిందని తెలిపారు. దీని కోసం 9300 ఎకరాల భూమిని అతి తక్కువ ధరలకే పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టడం వల్ల లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కన్వర్షన్ పేరుతో రియల్ ఎస్టేట్‌కు కట్టబెడతారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజల సౌకర్యాల కోసం, ఇంటి స్థలాలు, క్రీడా స్థలాలు, స్కూళ్ళు, హాస్టల్స్ కోసం కేటాయించవచ్చు. వేలాది ఎకరాలు, లక్షల కోట్లకు సంబంధించిన అంశంపై తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, శాసనసభలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాలుష్యాన్ని సృష్టించే పరిశ్రమలను నగరం నుండి తరలించాలి తప్ప, మిగతా పరిశ్రమలన్నింటిని ఎందుకు తరలిస్తున్నారని ప్రశ్నించారు. పరిశ్రమలు తరలిస్తే కార్మికుల పరిస్థితి, వారి భద్రతకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని నిలదీశారు. వాళ్ళకు అక్కడ నివాసం, విద్యా, వైద్యం, ఉపాధి పరిస్థితులు ఏంటీ? పరిశ్రమలను బయటికి తరలిస్తే, ఈ భూములను ఆ పారిశ్రామిక వేత్తలకే మార్కెట్ ధరకు కాకుండా, అతి తక్కువ ధరకే ఎందుకివ్వాలి? ప్రభుత్వం కేటాయించిన భూముల్లో మూతపడిన పరిశ్రమలు ఎన్ని? ఆ భూములు ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? నగరంలో విలువైన భూములను పారిశ్రామికవేత్తలకు దారాదత్తం చేయడమే. ఇదొక హిల్ట్ స్కామ్‌లా మారే పరిస్థితి కన్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ కూడా చేసిందని కాంగ్రెస్‌వారు అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినా, అది బీజేపీ ప్రభుత్వం చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం చేసినా ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి తప్ప, ప్రజల ప్రయోజనాల పేరుతో పారిశ్రామిక వేత్తలకో, రాజకీయ నాయకులకో అప్పగిస్తే అలాంటి పద్ధతులను తమ పార్టీ వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వెస్లీ డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై నిర్దిష్టమైన వివరాలు ప్రజలముందు ఉంచాలని కోరారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. విలువైన భూములను పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేసి, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.



## ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

### బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

**గోల్కొండ టైమ్స్, బెల్లంపల్లి**

పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ కోరారు. గురువారం సబ్ డివిజన్ పరిధిలోని కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల నాయకంపేట పోలింగ్ స్టేషన్ ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓటర్లతో మాట్లాడారు. నిర్భయంగా నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయాలని సూచించారు. ఓటర్లను భయపెడితే వారిపై చట్టంతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువకులు ఎన్నికలలో గొడవలకు దిగితే వారిపై కేసులు నమోదు చేస్తామని, కేసులు నమోదైతే ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయని హెచ్చరించారు. ఓటు హక్కును వినియోగించుకునే క్రమంలో ఎవరైనా బెదిరిస్తే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాండూర్ సీఐ నీలాల దేవయ్య, కన్నెపల్లి ఎస్సై భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే అండర్ బ్రిడ్జి రహదారిని పునరుద్ధరించాలని వినతి

**గోల్కొండ టైమ్స్, బెల్లంపల్లి**

బెల్లంపల్లి కాల్ టెక్స్ ఏరియా రైల్వే అండర్ బ్రిడ్జి రహదారిని పునరుద్ధరించాలని కోరుతూ గురువారం మాజీ కౌన్సిలర్లు బండి ప్రభాకర్, నెల్లి శ్రీలత రమేష్, చంద్రశేఖర్ లు బెల్లంపల్లి రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ గోపి కి వినతి పత్రం అందజేశారు. అండర్ బ్రిడ్జి నుండి వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. త్వరలోనే ఈ సమస్యపై రైల్వే జీఎం ని కలుస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంఏ సలీం తో పాటు పలువురు వ్యాపారస్తులు ఉన్నారు.

## బాలుడిపై వీధి కుక్కల దాడి..

### నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**

హైదరాబాద్‌లో ఎనిమిదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. నగర శివారులోని హయత్ నగర్ శివగంగా కాలనీలో ప్రేమ్‌చంద్ అనే ఎనిమిదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనకు సంబంధించి పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్, జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 29వ తేదీ లోపు నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, బాలుడి ప్రస్తుత పరిస్థితి, కుక్కల స్టెరిలైజేషన్, నియంత్రణ చర్యల స్థితిగతులను నివేదికలో పేర్కొనాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలు తీరుపై సమగ్ర నివేదిక అందజేయాలని కోరింది.



## హిల్ట్ పాలసీపై పోరాటం కొనసాగిస్తాం

### సర్కార్‌కు కేటీఆర్ హెచ్చరికలు

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**


హిల్ట్ పాలసీకి సంబంధించి ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిల్ట్ పాలసీకి వ్యతిరేకంగా జీడిమెట్ల పారిశ్రామికవాడలో కేటీఆర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు పరిశ్రమలకు రాయతీపై విలువైన భూములు కేటాయించారని.. హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఇపుడు భారీగా పెరిగాయని తెలిపారు. జీడిమెట్ల ప్రాంతంలోని పారిశ్రామిక వాడలో రూ.75 వేల కోట్ల వరకు విలువ చేసే భూములు ఉన్నాయని మాజీ మంత్రి అన్నారు. రెండేళ్లలో ఒక్క ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టలేదని విమర్శించారు. ఇండ్లు కట్టవచ్చని, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కట్టవచ్చన్నారు. ఇవేవీ చేయమంటున్నారని.. కనీసం శ్మశాన వాటికలకు కూడా స్థలం లేదన్నారు. కాలుష్యాన్ని నివారించాలని అనడంలో ఎవరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

రిజిస్ట్రేషన్ ధరలో 30 శాతం ఇచ్చి ఏమైనా చేసుకోవచ్చని ప్రభుత్వం అంటోందన్నారు. ఐదు లక్షల కోట్ల కుంభకోణంపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలని నిర్ణయించిందని వెల్లడించారు. ప్రజల ఆస్తిని సరైన పద్ధతిలో వినియోగించాలని సూచించారు. ప్రజల కోసం వినియోగించాలని, గ్రీన్ ఇండస్ట్రీస్ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభు త్వం ఇచ్చే ఆషాఢ సేల్ లాంటి ఆఫర్‌ను చూసి పారిశ్రామిక వేత్తలు మో సపోవద్దని తెలిపారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత వెనక్కు తీసుకుంటామన్నారు. చట్టం తీసుకొచ్చి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రేవం త్‌రెడ్డి భూ కుంభకోణంలో భాగం కావద్దని పారిశ్రామికవేత్తలను కోరా రు. ఫ్యూచర్ సిటీ పేరిట అక్కడ, హిల్ట్ పేరిట ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యా పారం చేస్తున్నారని ఆరపణలు గుప్పించారు. కోకాపేటలో వందల కోట్లు.. జీడిమెట్ల ప్రాంతంలో కోటి రూపాయలు అంటే ఎలా అని ప్రశ్నించారు.

## గ్లోబల్ సమ్మిట్‌లో కీరవాణి కచేరి

- అలరించనున్న భిన్న సాంస్కృతిక, కళా రూపాలు
- ఇంద్రజాల ప్రదర్శకుడు సామల వేణు ప్రదర్శన

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో అస్కార్ అవార్డు గ్రహిత, ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తన సంగీత కచేరితో అలరించనున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8న ప్రారంభమయ్యే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనే ప్రపంచ ప్రతినిధులకు భిన్న సాంస్కృతిక, కళారూపాలు అతిథులను అలరించనున్నాయి. ఈ సమ్మిట్ లో 90 నిమిషాల పాటు కీరవాణి ప్రత్యేక సంగీత కచేరి ఉంటుంది. ప్రముఖ వీణా విద్యాంసురాలు పి. జయలక్ష్మీ వీణా కార్యక్రమం, కళా కృష్ణ ఆధ్వర్యంలో పేరణి నాట్యం అతిథులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు సామల వేణు తన ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు.

వీటితో తెలంగాణ సంప్రదాయ కళా రూపాలు సందడి చేయనున్నాయి. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి కళలను ప్రతిబించేలా కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడి, ఒగ్గు డోలు, మహిళల డప్పులు, పేరణి నృత్యం, బోనాల కోలాటం వంటి ప్రజా కళారూపాలతో అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించనున్నారు. డిసెంబర్ 10 నుంచి 13 తేదీ వరకు ఈ వేడుకలను ప్రజలందరూ చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నాలుగు రోజులు రోజంతా మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తారు.

# 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్

- దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ'
- స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ప్రత్యేకంగా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**

"క్వాంటం సిటీ"గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. "క్వాంటం టెక్నాలజీ"లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"ని రూపొందించామన్నారు. గచ్చిబౌలిలోని "ఐఐటీ హైదరాబాద్"లో "నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం & తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ"ని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"లో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్వాంటం సెన్సింగ్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్ లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశం చేసే "డైరెక్షన్" అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్"కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. "ఇండస్ట్రీ డే" పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, మెంబర్ డా. వీకే సారస్వత్, దేబ్ జానీ ఘోష్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హిడ్మా ఎన్ కౌంటర్ భూటకం

- శంకర్‌ను కూడా చిత్రహింసలు పెట్టారు
- దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

హిడ్మాతో పాటు శంకర్లను పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారని మావోయిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరిని పోలీసులు పట్టుకొని కాల్చి చంపారని ఆరోపించారు. మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ మరో సంచలన లేఖను విడుదల చేసింది. హిడ్మాది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతోగురువారం లేఖ విడుదల చేసింది.

ఏపీకి చెందిన కొందరు కలప వ్యాపారుల ద్రోహం వల్లనే వీళ్ళు దొరికిపోయారని ఆ లేఖలో మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్లు చికిత్స కోసం విజయవాడకు వెళ్లినట్లు చెప్పారు. కలప వ్యాపారులతో కలిసి విజయవాడకు వెళితే వాళ్ళని పట్టుకున్నారన్నారు. వారం రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి ఆంధ్రా పోలీసులు చంపేశారని ఆరోపించారు. హిడ్మా, శంకర్ల ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు చేయాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ లేఖలో స్పష్టం చేశారు.

నవంబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో కీలక నేత హిడ్మాతో పాటు ఆయన భార్య, పలువురు అనుచరులు హతమవ్వగా, నవంబర్ 19న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ శంకర్ సహా ఆరుగురు మృతి చెందారని పోలీసులు ప్రకటించారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఘటనా స్థలంలో దొరికిన డైరీలోని సమాచారం ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు తనిఖీలు చేసి దాదాపు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

## 18 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం

- బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్
- బీజాపూర్ ఎన్‌కౌంటర్ వివరాలు వెల్లడి

**గోల్కొండ టైమ్స్, ములుగు**

చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ దంతేవాడ సమీపంలో ఉదయం నుంచి ఇప్పటివరకు ఎదురు కాల్పుల్లో 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ వెల్లడించారు. బుధవారం రాత్రి 8 గంటల సమయం వరకు 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా పోలీసు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం మరో 6 మృతదేహాలు లభ్యం అయ్యాయి. భద్రతా దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ ఎన్‌కౌంటర్లో ఇప్పటికే ముగ్గురు జవాన్లు మృతి చెందారు. సుదీర్ఘంగా జరిగిన కాల్పులలో మోడీయి వెల్లా ఉన్నారని ఆయనపై రూ.8 లక్షల రివార్డు ఉందని ఆయన తెలిపారు. పలు భారీ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

# గుండె పోటుతో కుప్పకూలిన వీడియో జర్నలిస్టు

**గోల్కొండ టైమ్స్, కుత్బుల్లాపూర్**

బీ ఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ కార్యక్రమంలో వీడియో తీస్తూ ఆజ్ తక్ చానెల్ కెమెరా మెన్(వీడియో జర్నలిస్టు) దామోదర్ గుండె పోటుతో కుప్పకూలాడు. గురువారం మధ్యాహ్నం జీడిమెట్లలో జరిగిన కేటీఆర్ ప్రోగ్రాంను వీడియో తీస్తూ హఠాత్తుగా కిందపడపోయిన దామోదర్ ను పోలీసులు హుటాహుటిన వెంటనే స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం దామోదర్ మృతి చెందారు. దామోదర్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తాను పార్టీ స్థాపించిన తొలినాటి నుంచి తెలంగాణ ఉద్యమ వార్తల కవరేజ్‌లో చురుకుగా పాల్గొనే వాడని గుర్తు చేసుకున్నారు. గాంధీ ఆసుపత్రిలో దామోదర్ మృతదేహానికి కేటీ ఆర్ నివాళులు అర్పించారు. దామోదర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

## కేసీఆర్, కేటీఆర్ సంతాపం

### మామిడి సోమయ్య సంతాపం..

సీనియర్ వీడియో జర్నలిస్టు దామోదర్ ఆకస్మిక మృతి అత్యంత బాధాకరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామి డిసోమయ్య విచారం వ్యక్తం చేశారు. దామోదర్ మృతికి ఆయన సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

Publish, printed & Owned by GOLCONDA TIMES MEDIA NETWORK, Survey of INDIA, Uppal, Hyderabad -500039, Cont: +919542605665, +918977912565, mail us: golcondatimes99@gmail.com, E-mail: admin@golcondatimes.com.